# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## పి.చంద్రశేఖర రెడ్డి

### (విజయచిత్ర – 1973, జనవరి సంచిక నుంచీ)

జీవితాలు తమాషాగా వుంటాయి. జీవితంలో అనుకొన్నదేదీ అనుకున్నట్టు జరగదు. అందుకే 'తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తుంది.' అన్నారు. పెద్దయితే, కలెక్టర్ అవాలనుకుని కృషి చేసే వ్యక్తి – కలెక్టర్ గుమస్తా కూడా కాకపోవచ్చును; ఇంజనీర్ అవుదామనుకున్న వ్యక్తి డాక్టర్ కావచ్చును; డాక్టర్ అవుదామనుకున్న యాక్టర్ కావచ్చును; యాక్టర్ అవుదామనుకుంటే సినిమా డైరెక్టర్ కావచ్చును. అలాగే – లాయర్ కావాలని వూహించుకున్న చంద్రశేఖరరెడ్డి – సినిమా దర్శకుడయ్యారు! లాయర్ కావాలన్న ఆ వూహ అతనిదొక్కడిదే కాదు – అతని తండ్రిగారిది కూడా! తండ్రిగారిదే కాదు – జ్యోతిష్యానిది కూడా! అతను పెద్ద న్యాయవాది అవుతాడన్న జోస్యాన్ని కూడా దైవం తారుమారు చేసి – సినిమా దర్శకుడిని చేసింది! అయితే ఇలాంటివి అపూర్వాలూ, ఆశ్చర్యాలూ కావు. మనిషి జీవిత చరిత్రలో తరచు జరిగేవే.

అయితే పి.సి. రెడ్డి చిన్నతనం నుంచీ కళాభిమాని. నాటకాల్లో వేషాలు వెయ్యడానికి ఉత్సాహం చూపడం; సాహిత్యం మీద ఉత్సాహం చూపడం – చేసేవాడు. నెల్లూరు జిల్లాలోని అనుమసముద్రం గ్రామంలో చంద్రశేఖరరెడ్డి బాల్యం గడుస్తున్నప్పుడు అతని వూహలు ఎలా వుండేవోగాని – పట్నం చేరిన తర్వాత మాత్రం కళ మీద అతనికి వున్న అభిమానం బయట పడింది.

చంద్రశేఖరరెడ్డి అన్నగారైన బలరామరెడ్డి – మద్రాసులో వ్యాపారం చేస్తూ వుండేవారు. అంచేత అతను నాలుగో ఫారం నుంచి మద్రాసులోనే చదవసాగాడు. అప్పట్నుంచే అతనికి కథల మీదా, కథలు రాయడం మీదా ఒక విధమైన ఉత్సాహం ఏర్పడింది. పత్రికల్లో కథలు రాయాలని ఊహిస్తూ వుండేవాడు. స్కూలు ఫైనల్ కు వచ్చేసరికి, అతని వూహలకు రెక్కలొచ్చాయి. చెల్లెలు మాలతీదేవీ, అతనూ కలిసి 'మాలతీ కృష్ణ' అన్న పేరుతో కథలు రాయడం మొదలు పెట్టారు. అసలు చంద్రశేఖరరెడ్డి పేరు అది కాదు – బాలకృష్ణారెడ్డి, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక వార పత్రికల్లో ఆ కథలు అచ్చయినాయి. ఏవో కారణాలవల్ల పేరు చంద్రశేఖరరెడ్డిగా మారింది. తర్వాత అతని చెల్లెలు ఎన్. మాలతీదేవి అన్న పేరుతో కథలు రాయడం మొదలుపెట్టారు. ఇటీవల విడుదలైన "ఇల్లు- ఇల్లాలు" కథ ఆమెదే, అలాగే రానున్న "జీవితం" చిత్ర కథకు ఇతివృత్తం కూడా ఆమెదే. ఈ కథలు అప్పట్లో ఆమె రాసిన కథలే.

కథల మీద నుంచి చంద్రశేఖరరెడ్డి ఉత్సాహం నెమ్మదిగా నాటకాల మీదికి కూడా మళ్ళింది. మద్రాసు పచ్చప్పాస్ కాలేజీలో చదువుతున్నప్పుడు, అతనికి నేటి దర్శకుడు – రామచంద్రరావుతో పరిచయమైంది. రామచంద్రరావు కూడా అదే కాలేజీలో చదువుతూ వుండేవారు. నాటకాల పట్ల ఎక్కువగా

ఉత్సాహం చూపిస్తూవుండేవారు. 'గుమస్తా' 'ఓటు నీకే' 'ఎవరు దొంగ?' మొదలైన నాటకాల్లో చంద్రశేఖరరెడ్డి నటించారు. కొంత కాలానికి ఈ నటన మరో పై మెట్టు కూడా ఎక్కింది. ముదిగొండ లింగమూర్తి రాసిన 'పెళ్ళి చూపులు' నాటికలో నటించి – రెడ్డి 'ఉత్తమ నటుడు' బహుమతి కూడా పుచ్చుకొన్నాడు. డాక్టర్ గోవిందరాజుల సుబ్బారావు చేతుల మీదుగా ఆ బహుమతి పుచ్చుకొంటున్నప్పుడు – ప్రేక్షకుల్లో వున్న సాటి విద్యార్థులంతా కరతాళ ధ్వనుల చేస్తున్నప్పుడు – చంద్రశేఖరరెడ్డి ఒళ్ళు పులకరించింది! తనూ ఒక నటుడిగా నిలబడగలిగానన్న ధైర్యం, నటించగలనన్న ధీమా ఏర్పడ్డాయి. అయితే, ఆ 'ధీమా ధైర్యాలు' – అతన్ని సినిమాల వైపు వెళ్ళమని మాత్రం ప్రోత్సహించలేదు! నాటకాల మీద అతనికి ఉత్సాహం కలగడానికి అతని అన్నగారి ఉత్సాహం కూడా కొంత కారణం. ఆయన పద్యాల నాటకాల అభిమాని. చిన్నతనం నుంచి, పద్య నాటకాలు చూడడం అంటే మహోత్సాహం చూపేవారు. వీలైనప్పుడల్లా – తమ్ముడిని కూడా వెంటబెట్టుకుని వెళ్తూ వుండేవారు.

1958 లో చంద్రశేఖరరెడ్డి బి. ఏ. డిగ్రీ తీసుకున్నారు. ఎమ్. ఏ. లో చేరి – చదువుతూ – కారణాంతరాలవల్ల మానేశారు. న్యాయవాది కావాలని ఆశపడ్డ అతని తండ్రిగారు – ఇంకో ఆశ కూడా పడ్డారు – తన కొడుకును పోలీస్ ఆఫీసర్ గా చూడాలని. అదీ కుదరలేదు. సబ్ ఇన్స్ పెక్టర్ ఉద్యోగానికి 'ఇంటర్వ్యూ' వస్తే – రాలేదని అబద్ధం చెప్పి వెళ్ళకుండా వూరుకున్నాడు రెడ్డి. వెళ్ళి వుంటే – అతని జీవితం ఇంకో దారి పట్టి – అలా సాగిపోయేది. ఆ దారిగుండా వెళ్ళకుండా ఆగిన అతని జీవితం – ఇంకో దారి కనిపిస్తే ఆ దారి పట్టింది. ఆ దారి సినిమా ప్రపంచానికి దారి. ఆ దార్లోకి వెళ్ళడానికి కారణం – అంతకు ముందే అతను ఇంకో చిన్న దోవగుండా వెళ్ళి – 'సినిమా దారి' చూడడం!

ఇంటర్ మీడియేట్ తర్వాత అతనికి మూడు సంవత్సరాల పాటు – విరామం దొరికింది. ఆ సమయంలో అతను విజయవాడలో ప్రభాత్ పిక్చర్స్ అనే డిస్ట్రిబ్యూషన్ ఆఫీసులో కొంత కాలం ఉద్యోగం చేశాడు. ఆ టైమ్ లో అతను ప్రతి రోజూ సినిమాలు చూస్తూ వచ్చాడు. అలా సినిమాలు చూడడంలో అతనికి తెలియకుండానే అతని ఊహలు ఆ సినిమా కథల మీద, సినిమాల మీదా చర్చలు చెయ్యసాగాయి. అలా అతని వూహ నెమ్మదిగా సినిమా ప్రపంచంలో విహరించింది.

మద్రాసులో బి. ఏ. చదువుతున్నప్పుడు వల్లం నరసింహారావుతో పరిచయమైంది. అతని ద్వారా దర్శకుడు జగన్నాథ్ పరిచయం కావడం – సినిమాల్లో పనిచెయ్యాలన్న ఉత్సాహం తనకు వున్నట్టు ఆయనతో చెప్పడం – ఆయన సరేననడం జరిగాయి. ఒక వేపు చదువుకుంటూనే – అతను సినిమాల్లో ప్రవేశించాడు. 'ధర్మ విజయం' అనే కన్నడ చిత్రంలో దర్శకత్వ శాఖలో. జీతం వ్యవహారాలేమీ లేవు; పైగా షూటింగ్స్ లేనప్పుడే కాలేజీకి వెళ్ళడం! సినిమా దర్శకత్వం అన్నది – అసలు షూటింగ్ ఎలా చేస్తారన్నదీ కూడా అతనికి తెలీదు.

చాలా కాలం క్రితం, శోభనాచల స్టూడియోలో షూటింగ్ జురుగుతున్నదని విని, ఒక మిత్రుడితో కలిసి చూడాలని వెళ్ళాడు. అప్పుడు 'మాయలమారి' చిత్రం షూటింగ్ లో వుంది. దాదాపు మూడు గంటల పాటు బయట నిరీక్షించిన తర్వాత, షూటింగ్ చూడ్డానికి వీల్లేదని అందర్నీ బయటకి వెళ్ళమన్నారు. అంతే ! అప్పుడైనా అతను షూటింగ్ వాతావరణం చూడగలిగాడేగాని, షూటింగ్ మాత్రం చూడలేదు !

చంద్రశేఖరరెడ్డిని జగన్నాథ్ 'శ్రీ కృష్ణరాయభారం' చిత్రానికి ప్రధమ సహాయకుడిగా తీసుకున్నారు! అప్పటికి అతనికి అనుభవం ఏమీ లేదనే చెప్పాలి. ఉత్సాహం మాత్రం కొండంత వుంది. అదే అతనికి అనుభవం కంటె గొప్పగా సహాయపడింది.

చంద్రశేఖరరెడ్డి నటుడిగా సినిమాల్లో ప్రవేశిస్తాడని అతని మిత్రులు చాలా మంది ఆశించారు. ఎంచేతంటే – అతను వల్లం, మిక్కిలినేని, పెరుమాళ్ళు మొదలైన వాళ్ళతో కలిసి నాటకాల్లో వేషాలు వేశాడు. పోతుగడ్డ, కులం లేని పిల్ల, అన్నా చెల్లెలు మొదలైన నాటకాల్లో అతన్ని చూసిన చాలా మంది, సినిమాల్లో వేషాలకు ప్రయత్నించమని సలహాలు ఇచ్చారు. అయితే ఎందుకనో రెడ్డి ఆ మార్గంలోకి వెళ్ళలేదు.

'శ్రీ కృష్ణరాయభారం' జరుగుతూవుండగానే – వి. మధుసూదనరావు చంద్రశేఖరరెడ్డిని జగపతి సంస్థలో జేర్చారు. అక్కడ నుంచీ అతను జగపతిలో వుంటూ 'అన్నపూర్ణ' నుంచి 'అదృష్టవంతులు' వరకూ సహకార దర్శకుడిగా పని చేశాడు. ఇవేకాకుండా – లక్షాధికారి, జమీందారు, టాక్సీరాముడు, మనుషులు మారాలి చిత్రాలకు కూడా వి. మధుసూదనరావు దగ్గరే పని చేశాడు. మధ్యలో అన్నపూర్ణ సంస్థలో 'పూలరంగడు' చిత్రానికి ఆదుర్తి దగ్గర కూడా పని చేశాడు.

"ఇలాంటి దర్శకుల దగ్గర పని చెయ్యడం; క్రమశిక్షణ, పద్ధతీ పాటించే పెద్ద సంస్థలో పని చెయ్యడం – నా ప్రగతికి బాగా తోడ్పడ్డాయి." అంటారు చంద్రశేఖరరెడ్డి.

'మనుషులు మారాలి' జరుగుతున్న కాలంలో — అతని మిత్రుడు యన్. వి. ప్రభాకరరెడ్డి సొంతంగా చిత్రం తియ్యాలనుకుని, చంద్రశేఖరరెడ్డిని దర్శకుని చెయ్యాలనుకున్నారు. జగపతి అధిపతి రాజేంద్రప్రసాద్ ప్రోత్సాహం లభించింది; వి. మధుసూదనరావు బలపరిచారు. ఆ ప్రోత్సాహ బలాలతో ఆయన దర్శకుడు కాగలిగాడు. తొలిచిత్రం : 'అనురాధ'. ఆ చిత్రం నిర్మాణంలో వుండగానే నందిని వారి 'అత్తలూ కోడళ్ళూ' చిత్రం వచ్చింది. అయితే ముందుగా విడుదలైన చిత్రం — 'అత్తలు కోడళ్ళూ'. ఈ చిత్రం తర్వాత, 'విచిత్ర దాంపత్యం', 'మానవుడు దానవుడు' 'బడిపంతులు' 'ఇల్లు ఇల్లాలు' చిత్రాలు డైరక్టు చేశారు. వీటిల్లో 'మానవుడు దానవుడు' కొత్తరకం చిత్రంగా ప్రశంసింపబడి, శతదినోత్సవం చేసుకున్నది. తక్కిన చిత్రాలు కూడా ఆర్థికంగా విజయవంతమైనవే. 'మానవుడు దానవుడు' తమిళంలోనూ, హిందీలోనూ నిర్మింపబడుతున్నాయి.

చంద్రశేఖరరెడ్డి ప్రస్తుతం — కృష్ణకిశోర్, గౌరీ శంకర్, శ్రీవాణి కంబైన్స్, నందినీ కంబైన్స్ మున్నగు సంస్థల చిత్రాలను డైరెక్టు చేస్తున్నారు. వీటిల్లో కృష్ణ కిశోర్, గౌరీ శంకర్ సంస్థల చిత్రాలు షూటింగ్ కార్యక్రమాల్లో వున్నాయి.

"సెట్సు మీద — ఒకేసారి రెండు చిత్రాల కంటె ఎక్కువ చిత్రాలు వుండడం నేను అంగీకరించను." అన్నారు రెడ్డి — తన విధానం గురించి మాట్లాడుతూ.

వ్యక్తిగతంగా ఆయనకు మంచి కుటుంబగాథలు అంటే ఇష్టం. అన్నీ కలిసి వస్తే ఏదైనా ప్రయోగాత్మకమైన చిత్రం తియ్యాలన్న ఆకాంక్ష కూడా వుంది.

"నిజంగా, పెద్ద దర్శకుల దగ్గర, పెద్ద సంస్థలలోనూ, పని చెయ్యడమే గొప్ప అనుభవంగా నేను భావిస్తాను. అక్కడ నేను నేర్చుకున్న పాఠాలు అన్నీ ఇన్నీ కాదు. ఆ పాఠాలు తర్వాత ఉపయోగపడతాయని, అప్పట్లో నాకు తెలిసిరాకపోయినా, ఇవాళ నేను వెనక్కి చూసుకుంటే — నాడు నేర్చుకున్నవన్నీ నేడు ఎంతగానో ఉపయోగపడుతున్నందుకు నేనెంతో ఆనందపడుతూ వుంటాను. అది నా అదృష్టంగా భావిస్తూ వుంటాను.

చిత్రాలు నిర్మించాలనునే వారికి, అన్ని విషయాలూ కాకపోయినా కొన్నయినా తెలిసి ఉండడం అవసరం అని నా అభిప్రాయం. దాని వల్ల — అన్నింటికీ, దర్శకుడి పైనో, తక్కిన వారి పైనో ఆధారపడవలసిన అవసరం వుండదు." అన్నారు ఆయన.

ఆయన ప్రస్తుతం దర్శకత్వం వహిస్తున్న రెండు చిత్రాలకు నిర్మాతలే కథా రచయితలు. అలా — నిర్మాతలే కథకులు కావడం వల్ల చిత్ర దర్శకుడికి ఎలాంటి సదుపాయాలు వున్నాయి? మంచిదా ? కాదా ? — అన్న ప్రశ్నకు సమాధానం చెబుతూ ఆయన — "అందులో కొంత లాభమూ వుంది; నష్టమూ వుంది. చిత్ర నిర్మాతే కథకుడు కాబట్టి — కథలో ఏదైనా కొత్తదనం వంటిది వుంటే — 'నిర్మాత ఏమంటారో" అన్న ఆలోచన ఉండదు. ధైర్యంగా ప్రయోగం చెయ్యవచ్చు. 'మానవుడు దానవుడు' చిత్రానికి అదే జరిగింది. ఆ చిత్ర నిర్మాతే శ్రీ చిన్నపరెడ్డే ఆ చిత్రానికి కథకులు, ఆయనే నిర్మాత కాబట్టి — ధైర్యంగా ముందుకు పోగలిగారు. అలా — చిత్రానికి మంచి సహాయం జరిగింది. నిర్మాతే కథకుడైతే దర్శకుడే నిర్ణయాలు చెయ్యవలసి వస్తుంది. సినిమా కథ చర్చ చెయ్యడానికి సాధారణంగా కూర్చునే నలుగురిలోనూ (దర్శకుడు, నిర్మాత, కథకుడు, రచయిత) ఒకరు తగ్గిపోతారు. ఏమైనా నిర్మాతే కథకుడు కూడా అయితే, ఒక విధంగా మంచిదేనని నా అభిప్రాయం. ఇప్పుడు నేను దర్శకత్వం వహిస్తున్న శ్రీ వాణీ కంబైన్స్, కృష్ణ కిశోర్ చిత్రాలకు ఆయా నిర్మాతలే కథకులు. కథకుడే నిర్మాతయినప్పుడు, నిర్మాణ దృష్ట్యా కూడా కథను మలచుకోడానికి వీలుంటుంది" అన్నారు.

నేటి చిత్ర నిర్మాణం గురించి చెబుతూ — "నేను సహాయ, సహకార దర్శకుడిగా వున్న రోజుల్లో వున్న నటీనటుల సహకారం ఇవాళ లభించడం లేదు. అందుకని, అనుకున్నది అనుకున్నట్టూ, తియ్యదలచుకున్నది తలచుకొన్నట్టూ తియ్యలేకపోతున్నాము. ఇవాళ సెట్లో వున్న దర్శకుడికి, సహాయకులకీ, తప్ప తక్కిన వాళ్ళెవరికీ ఆత్రుత, ఆలోచనా లేవు. నటీనటుల కాల్షీట్స్ దొరకడం కష్టంగా వున్న రోజులు. అయినా వాళ్ళెప్పుడు వస్తారో ఎవరికీ తెలియదు గాని, ఎప్పుడు వెళ్ళిపోవాలో ఆ టైమ్ తెలుస్తుంది. వాళ్ళు చాలా బిజీ. వాళ్ళు సెట్లో వున్నంతలోనే — అనుకున్నది తియ్యాల్సి వస్తుంది. ఆ వ్యవధిలో దర్శకుడు అనుకున్నది అనుకున్నట్టు తియ్యలేకపోతున్నాడు. చిత్ర నిర్మాణం పథకాల ప్రకారం జరగాలి. కాని, పథకాలు వెయ్యడానికి అవకాశమే లేకుండా పోతున్నది. ప్రతి ఆర్టిస్ట్ నూ 'ఎడ్జస్ట్' చెయ్యవలసి వస్తున్నది. దాంతో అనుకున్నవి తారుమారవుతున్నవి" అన్నారు చంద్రశేఖరరెడ్డి.

"సినిమాకు అవసరమైనది మంచి కథ. మంచి కథ కావాలంటే మంచి రచయితలు రాయాలి. నవలలను సినిమాలుగా తియ్యాలనుకుంటే — నవల నవలగా ఉండడం లేదు; అది సినిమాలాగే వుంటున్నది.

ఉన్న చిత్రాన్ని, తిరిగి చిత్రంగా తియ్యడంలో స్వేచ్ఛ వుండదు. సొంతంగా చిత్రం తీస్తున్నప్పుడు మంచి ఉత్సాహం వుంటుంది; స్వేచ్ఛ వుంటుంది. ఉన్నదాన్ని, బాగా 'డ్రమటైజ్' చేసి చెప్పడానికి అవకాశం వుంటుంది. ముఖ్యంగా 'ఏదో చెయ్యగలుగుతున్నాం – చేస్తున్నాం' అన్న తృప్తి మిగుల్తుంది. ఎవరు కోరుకున్నదైనా ఆ తృప్తే !" అన్నారు చంద్రశేఖరరెడ్డి.

★★★

COMMENTS